నమస్తే తెలంగాణ

# హనుమకొండ

5 | వరంగల్, గురువారం 22 మే 2025 | HANUMAKONDA



భారీ వర్షంతో చెరువును తలపిస్తున్న నర్సంపేట వ్యవసాయ మార్కెట్

## వడ్లు వరదపాలు

# రైతు కంట కన్నీళ్లు

## భారీ వర్షానికి చెరువులైన కొనుగోలు కేంద్రాలు



ఖానాపురం : రంగాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని ఎత్తి పోస్తున్న రైతు కొమ్మాలు

- నర్సంపేట మార్కెట్‌ను ముంచెత్తిన వరద
- ఎక్కడికక్కడ తడిసి ముద్దయిన ధాన్యం, బస్తాలు
- కొన్నిచోట్ల నీళ్లలోనే రాశులు.. కొట్టుకుపోయిన వడ్లు
- టార్పాలిన్లు కప్పినా ఫలితం లేదని అన్నదాతల ఆవేదన
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్
- పలుచోట్ల విరిగిపడిన చెట్లు, కూలిన విద్యుత్ స్తంభాలు

నమస్తే నెట్‌వర్క్, మే 21 : ఉమ్మడి జిల్లాలో మంగళవారం రాత్రి, బుధవారం కురిసిన వర్షం రైతుకు తీరని నష్టాన్ని మిగిల్చింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. పరదాలు కప్పినప్పటికీ 90 శాతం ధాన్యం వర్షార్పణమైంది. కొన్ని చోట్ల వడ్లు కొట్టుకుపోయాయి. మాయిశ్చర్ పేరుతో కొనుగోళ్లు ఆలస్యం చేయడంతో ధాన్యం తడిసి నష్టపోయామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పలు చోట్ల చెట్లు విరిగిపడగా, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. పిడుగు పాటుకు ఇద్దరు మృతి చెందారు. హనుమకొండ, వరంగల్ నగరంలోని లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో వర్షం నీరు నిలవడంతో జనం ఇబ్బందులు పడ్డారు. హనుమకొండలో 17.5 మి.మీ, వరంగల్ జిల్లాలో 18.3 మి.మీ వర్షపాతం నమోదైంది. నర్సంపేట మండలంలో పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో రైతులు ఆరబోసిన ధాన్యం తడిసింది. వరదకు వడ్లు కొట్టుకుపోయాయి. చెన్నారావుపేట, నెక్కొండ, ఖానాపురం, వర్ధన్నపేట, సంగెం, శాయంపేట మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. తూకం వేసిన బస్తాలు కూడా తడిసిపోయాయని రైతులు వాపోయారు. మహబూబాబాద్, కేసముద్రం, కొత్తగూడ, తొర్రూరు, నర్సింహులపేట, పెద్దవంగర మండలాల్లో కొనుగోలు కోసం తీసుకొచ్చిన ధాన్యంతో పాటు కాంటాలు వేసిన బస్తాలు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. తొర్రూరు–నర్సంపేట రహదారిపై చెట్టు విరిగి పడి కొద్దిసేపు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ఏటూరునాగారం, వాజేడు మండలాల్లో ధాన్యం రాశులు, బస్తాలపై రైతులు టార్పాలిన్ షీట్లు కప్పి కాపాడుకున్నారు. కొడకండ్ల, చిల్పూరు మండలాల్లో లారీలు సరిగ్గా రాక, ధాన్యం నింపడానికి బస్తాలు లేక కొనుగోలు చేయడం లేదని, వర్షంతో తడిసి నష్టపోయామని రైతులు లబోదిబోమన్నారు.



కేసముద్రం మండలం కల్వలలో ధాన్యం రాశి కిందకు నీరు పోకుండా మట్టితో కట్టపోస్తున్న రైతులు



నెక్కొండ మండలంలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని కుప్పచేస్తున్న మహిళా రైతు



ఖానాపురం ధాన్యం కొనుగోలు కేంద్రంలో వరద నీటిని తొలగించేందుకు కాల్వ తీసిన రైతులు



పెద్దవంగర మండలం బొమ్మకల్లులోని కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు



నర్సంపేట మార్కెట్‌లో తడిసిన ధాన్యం బస్తాలు



హనుమకొండలో వర్షంలో బైక్‌పై వెళ్తున్న వాహనదారుడు

## పిడుగు పడి ఇద్దరు దుర్మరణం

గూడూరు/కొత్తగూడ : మహబూబాబాద్ జిల్లాలో పిడుగు పడి ఇద్దరు మృతి చెందారు. గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన మైదం ప్రవీణ్ (30) పని నిమిత్తం బయటికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో వర్షం రావడంతో చెట్టు కింద నిలుచున్నాడు. సమీపంలో పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఉపాధి హామీ పథకంలో భాగంగా గుండెంగ గ్రామ పంచాయతీ లో చెట్లకు నీటిని అందించే పనిచేస్తున్నాడు. ప్రవీణ్‌కు తండ్రి సారయ్య, సోదరుడు ఉన్నారు. అదే విధంగా కొత్తగూడ మండలం ఓటాయి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి ఏశబోయిన చేరాలు(60) గొర్రెలను తీసుకొని మేత కోసం వెళ్లాడు. వర్షంతో పాటు పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఐల్లమ్మ, పిల్లలు ఉన్నారు. అదేవిధంగా వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అమీన్‌పేటలో పిడుగు పాటుకు చిలుకూరి సారమ్మకు చెందిన పాడి గేదె మృతి చెందింది.



## వావ్.. వరంగల్ రైల్వేస్టేషన్

నేడు ప్రధాని మోదీతో వర్చువల్ ఓపెనింగ్

*అమృత్ భారత్ పథకంలో భాగంగా ఎయిర్‌పోర్ట్‌ను తలపించేలా మూడు లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లు, ల్యాండ్ స్కేపింగ్, వెయిటింగ్ హాల్స్, ప్లాట్‌ఫాం షెల్టర్లతో వరంగల్ రైల్వేస్టేషన్ సరికొత్తగా రూపుదిద్దుకున్నది. నేడు(గురువారం) ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించనుండగా స్టేషన్‌ను అందంగా తీర్చిదిద్దారు.*

*- ఖిలావరంగల్, మే 21*

## ఇస్రో రీజినల్ కో ఆర్డినేటర్లుగా జితేందర్, సరిత

హనుమకొండ చౌరస్తా, మే 21 : ఇస్రో వరంగల్ ప్రాంతీయ కో–ఆర్డినేటర్లుగా హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ ఫిజిక్స్ విభాగం సహాయ ఆచార్యులు లాదల జితేందర్, డాక్టర్ ఆలేటి సరితలను నియమిస్తూ ఇస్రో చైర్మన్ ఉత్తర్వులు జారీ చేశారని ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకర జ్యోతి తెలిపారు. ఇస్రో చేపట్టే ప్రతిష్టాత్మక పరిశోధనలపై విద్యార్థులకు అవగాహన పెంపొందించేందుకు వీరిద్దరు పనిచేస్తారని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా జితేందర్, సరితను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.



సరిత



జితేందర్

# అతిథులకు అటవీ శాఖ విడిది

- ముక్తివనంలో నాలుగు ఉడెన్ కాటేజీలు
- ఉల్లాసంగా సేదతీరేందుకు ఏర్పాట్లు

జయశంకర్ భూపాలపల్లి, మే 21 (నమస్తే తెలంగాణ) : కాళేశ్వరం గ్రామం.. చుట్టూ అభయారణ్యం.. పక్కనే కాళేశ్వర–ముక్తీశ్వరాలయం.. చెంతనే గోదావరి, ప్రాణహిత, సరస్వతీ (అంతర్వాహిని) సంగమం. నిత్యం రద్దీగా ఉండే ఈ గ్రామంలో అటవీశాఖ అతిథుల కోసం మంచి విడిదిని ఏర్పాటు చేసింది. 2015లో కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరంలో అన్ని హంగులతో సందర్శకులకు అనువుగా ఒక బృందావనంలా ముక్తివనాన్ని ఏర్పాటు చేసింది. ప్రకృతి ఒడిలో ఉల్లాసంగా గడపడానికి రూ.1.58 కోట్లతో అన్ని ఏర్పాట్లు చేసింది. అటవీ శాఖ మరో రూ.4 కోట్లతో అభివృద్ధి చేసింది. ఉడెన్ కాటేజ్, ఉడెన్ క్యాంటీన్, పిల్లలు ఆడుకునేందుకు ప్రత్యేక పార్క్, సుమారు 5 కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్, నీటి కొలనుతో అందంగా తీర్చిదిద్దింది. కాగా, తాజాగా అటవీశాఖ మరో మూడు ఉడెన్ కాటేజీలను ఏర్పాటు చేసింది. నేలమీద కాకుండా చెట్లపై బెడ్రూం (ఏసీ), బాత్రూం, హాల్‌లో విలాసవంతంగా ఏర్పాటు చేసిన ఈ ఉడెన్ కాటేజీలు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. సరస్వతీ పుష్కరాల సందర్భంగా భక్తులు కాటేజీలను సద్వినియోగించుకుంటున్నారు. రూ.2500 ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. ముక్తివనంలో వీడియో చిత్రీకరణకు అదనంగా రూ.వెయ్యి వసూలు చేస్తున్నట్లు అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ ఆనంద్ తెలిపారు.



ముక్తివనంలో ఏర్పాటుచేసిన కాటేజ్



కాటేజీలో ఏర్పాటు చేసిన క్రీడా వసతి

## కూలి డబ్బుల్లో కోత పెడతారా?

**ఈజీఎస్ సిబ్బంది తీరుపై కూలీల ఆగ్రహం**

చిన్నగూడూరు, మే 21 : మండుటెండలో 16 రోజులు ఉపాధిహామీ పనులు చేస్తే ఒక్కో కూలికి రూ.250 మాత్రమే చెల్లించారని ఉపాధిహామీ కూలీలు మండిపడ్డారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రానికి చెందిన 150 మంది కూలీలు స్థానిక ఎంపీడీవో ఆఫీసు ఎదుట ఆందోళన నిర్వహించి టీఏ వీరేశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మస్టర్ ప్రకారం పెద్ద చెరువులో 16 రోజులు పనులు చేస్తే కేవలం రూ.250 మాత్రమే చెల్లించారని వారు ఆరోపించారు. పని ప్రదేశాల్లో కూలీలకు తాగునీరు, నీడ, ఫస్ట్‌ఎయిడ్ వంటి సౌకర్యాలు కల్పించకున్నా మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లి పనులు చేస్తున్నామని తెలిపారు. వారంలో చివరి రోజు ఈజీఎస్ సిబ్బంది వచ్చి పనుల్లో నాణ్యతలేదంటూ కూలీల డబ్బులో కోత విధిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఏపీవో మాధవి స్పందిస్తూ కూలీలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



చిన్నగూడూరులో టీఏ వీరేశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు



బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన వసతి గృహం

### కేసీఆర్ నిర్మించిన వసతి గృహమే దిక్కు

కాళేశ్వరంలో వంద గదుల వసతి గృహమే పెద్ద దిక్కయ్యింది. రూ.8 కోట్లతో కేసీఆర్ ప్రభుత్వం దీన్ని నిర్మించగా, చిన్నచిన్న పనులు మినహా అన్నీ పూర్తి చేసింది. ప్రస్తుతం సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో ఈ వసతి గృహం అధికారులందరికీ సౌకర్యంగా ఉంది. కాళేశ్వరంలో ఇంత పెద్ద వసతి గృహాలు లేకపోవడంతో పుష్కర డ్యూటీలో ఉన్న అధికారులందరికీ ఇందులో వసతి కల్పించారు. కింద సెల్లార్‌లో వంటలు చేయడం, భోజనాలు వడ్డించడం చేస్తున్నారు. ఈ వసతి గృహం లేకుంటే అధికారుల విడిదికి చాలా ఇబ్బందిపడాల్సి వచ్చేదని, కేసీఆర్ ముందు చూపుతో చేసిన పనులు ఇప్పటికీ గుర్తుంటాయని పలువురు అధికారులు పేర్కొంటున్నారు.

### అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

వర్షాలు వచ్చే అవకాశమున్న నేపథ్యంలో సింగరేణి రెస్క్యూ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. వాకీటాకీల ద్వారా సంబంధిత బృందాలతో రక్షణ చర్యలు, అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వ హించారు. విద్యుత్ తీగలు తెగిపోవడం వంటి పరిస్థితులకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల రద్దీకనుగుణంగా అదనంగా పార్కింగ్ స్థలాలను గుర్తించనున్నట్లు తెలిపారు.

## పుష్కర స్నానం..

# పులకించిన జనం

- ఏడో రోజూ తరలివచ్చిన భక్తులు
- త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు
- ముక్తీశ్వరుడిని దర్శించుకుని పూజలు
- క్యూలో ఇబ్బంది పడిన జనం

జయశంకర్ భూపాలపల్లి, మే 21(నమస్తే తెలంగాణ)/మహదేవపూర్ (కాళేశ్వరం) : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతీ పుష్కరాల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి పులకించిపోతున్నారు. బుధవారం తెలంగాణ నలుమూలల నుంచే కాక ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి కాళేశ్వర ముక్తేశ్వర క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. సుమారు లక్ష పైచిలుకు వచ్చారని అధికారులు అంచనా వేస్తున్నారు. త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించి నదిలో ప్రత్యేక పూజలు చేసిన ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. కలెక్టర్ రాహుల్ శర్మ కుటుంబ సభ్యులతో కలిసి గోదావరిలో పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం కాళేశ్వరంలోని స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పోలీసులతో వాగ్వాదానికి దిగిన భక్తులు



క్యూలో సొమ్మసిల్లి పడిపోయిన వృద్ధురాలు

### ఉచిత బస్సులు సరిపడా లేక భక్తుల ఇబ్బందులు

కాళేశ్వరానికి ఆర్టీసీ బస్సుల్లో, ప్రైవేటు వాహనాల్లో చేరుకుంటున్న భక్తులు తాత్కాలిక బస్టాండ్ నుంచి పుష్కర ఘాట్‌కు వెళ్లేందుకు సుమారు కిలోమీటరు లగేజీతో నడవలేక ఎండల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సింగరేణి సహకారంతో 19 సింగరేణి స్కూల్ బస్సులు, ప్రస్తుతం మరో ఐదు ఎలక్ట్రిక్ ఆటోలను ఏర్పాటు చేసినా పెరుగుతున్న రద్దీకి అవి ఏ మాత్రం సరిపోవడం లేదు. దీంతో భక్తులు కాలినడకన లగేజీతో పుష్కర ఘాట్‌కు వెళ్లి అక్కడి నుంచి దర్శనానికి వెళ్తున్నారు. ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో గంటల సమయం క్యూలో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేయలేకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. ఓ వృద్ధురాలు స్పృహ తప్పి పడిపోయింది. సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురవడంతో వీఐపీ ఘాట్ వద్ద టెంట్లు కూలిపోయాయి. భారీ కటౌట్ ప్రధాన రహదారిపై విరిగిపడింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.



నదిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

### వీఐపీలకే పెద్ద పీట వేస్తున్నారు



విధుల్లో ఉన్న అధికారులు వీఐపీల సేవలోనే ఉంటున్నారు. ఇదేంటి ప్రశ్నిస్తే భక్తులతో వాగ్వాదానికి దిగుతున్నారు. భక్తులకు సరైన సౌకర్యాలు లేవు. దర్శనం కోసం గంటల తరబడి క్యూలో వేచి ఉండాల్సిన వస్తున్నది. చిన్న పిల్లలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **– అభినవ్, హైదరాబాద్**

### గోదావరి నదికి పోవుడెట్ల?



నది దగ్గరికి పోయేందుకు పోలీసులు వాహనాలను అనుమతించడం లేదు. నడుచుకుంటా వెళ్లేందుకు చాలా ఇబ్బందిగా ఉంది. వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తే బాగుండేది. అధికారుల తీరంతా డూడూ బసవన్నలా ఉంది. ఇప్పటికైనా సౌకర్యాలు కల్పించాలి. **– సంతోషి, హైదరాబాద్**

### అంతా గందరగోళం..



భక్తుల రద్దీ కనుగుణంగా వసతులు లేక అంతా గందరగోళంగా ఉంది. గంటల తరబడి క్యూలో నరకయాతన పడాల్సి వస్తున్నది. ఇక్కడ ఎవరూ పట్టించుకోవడం లేదు. దర్శనం కోసం వస్తే ప్రాణాలే పోయేలా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ చూడలేదు.

– మధుకర్, మంచిర్యాల

